క్లుప్తంగా

బెంచీల ధ్వంసంపై ఫిర్యాదు

రఘునాథపల్లి : మండల కేంద్రంలోని 13వ వార్డులోని ఖాళీ స్థలంలో స్థానికులు సేద తీరేందుకు పంచాయతీ పాలకవర్గం ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను ఓ వ్యక్తి ధ్వంసం చేయడంపై స్థానికుడు ఠాకూర్ గణేష్‌సింగ్ శుక్రవారం జిల్లా కలెక్టర్, డీసీపీలకు ఫిర్యాదు చేశాడు. ట్రాక్టర్‌తో రెండు సిమెంట్ బెంచీలు ధ్వంసం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇదే ఘటనలో సిమెంట్ బెంచీలు ధ్వంసం చేసిన వ్యక్తి బెంచీపై కూర్చున్న తనపై ట్రాక్టర్‌ను తీసుకురాగా తృటిలో ప్రాణాలతో బయటపడ్డానని దండ్ల అశోక్ అలియాస్ ప్రశాంత్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

‘చట్టప్రకారమే అమ్ముకున్నా’

జనగామ రూరల్: తాను విక్రయించింది అక్రమ పట్టా కాదని చట్టప్రకారం అమ్ముకున్నానని చిల్పూర్ మండలానికి చెందిన బోళ్ల స్వప్న శుక్రవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేసింది. మండలంలోని సర్వే నంబర్ 557, 559ఏ1, 562లో 1.24 గుంటల భూమి తన వరకట్నం కింద కొనుగోలు చేశామని, తన భర్త రాజ్‌కుమార్‌కు గాని తన తల్లిదండ్రులకు గానీ భూమిపై ఎలాంటి హక్కులు లేవని తెలిపింది. గత కొంత కాలంగా గొడవలతో భర్తకు దూరంగా తల్లి వద్ద ఉంటున్నానని అనారోగ్య కారణంగా అప్పు చేయగా వాటిని చెల్లించలేక మరో వ్యక్తికి ఇష్టపూర్వకంగా అమ్ముకునట్లు ఆమె తెలిపారు. తహసీల్దార్‌కు, ఏ అధికారి ప్రమేయం లేదని తెలిపింది.

మాజీ మంత్రి పరామర్శ



దేవరుప్పుల : తెలంగాణ సాధనతో పాటు పార్టీ బలోపేతం కోసం పనిచేసే ప్రతి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపలిలో మృతి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బట్ట యాదయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ముస్‌పహాడ్‌లో మండల నాయకుడు బస్వ సోమనర్సయ్య తల్లి మృతి చెందగా ఆమె చిత్రపటానికి పూలమాల వేశారు. ఆయన వెంట వెంకటాచారి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సుందర్‌రామిరెడ్డి, మల్లేష్, రవి, సోమ సుందర్, భిక్షపతి, సోమనర్సయ్య, పరశురాములు, సత్యనారాయణ, ఉన్నారు.

పల్లె ప్రగతి ఆస్తులు వినియోగంలో ఉండాలి



జఫర్‌గఢ్ : పల్లెప్రగతి ద్వారా గ్రామాల్లో చేపట్టిన ఆస్తులు పూర్తిస్థాయిలో వినియోగంలో ఉండేలా చూడాలని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ అనిల్‌కుమార్ కోరారు. మండలంలోని తీగారం గ్రామాన్ని శుక్రవారం ఆయన అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పల్లె పకృతి ఆస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లె ప్రగతి ద్వారా గ్రామాల్లో వైకుంఠధామాలు, నర్సరీలు, పల్లె పకృతివనం, క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటిని సక్రమంగా వినియోగించుకునే విషయంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకూడదన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ సుమన్, పంచాయతీ కార్యదర్శి రాజేష్ ఉన్నారు.

కొడవలితో తండ్రిపై తనయుడి దాడి

తరిగొప్పుల: క్షణికావేశంలో కొడవలితో తండ్రిపై తనయుడు దాడి చేసిన సంఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..స్థానిక బేడబుడగజంగాల కాలనీకి చెందిన పడుతం కనుకయ్యకు తన చిన్న కుమారుడు దావీదుకు శుక్రవారం రాత్రి చిన్న ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో క్షణికావేశానికి గురైన దావీదు కొడవలితో తండ్రిపై దాడి చేశాడు. దీంతో కనుకయ్యకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం తెలియడంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దాడికి పాల్పడిన దావీదు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

దుర్గామాత ఉత్సవాలు

బచ్చన్నపేట: మండలంలోని లక్ష్మాపూర్‌లో మూడోసారి దుర్గామాత ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ నూకల నవ్య, ఆలయ కమిటీ చైర్మన్ నూకల నర్సిరెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఆలయాన్ని రంగులతో సుందరంగా తీర్చిదిద్దామన్నారు. శనివారం దుర్గామాతకు ఊరంతా బోనాలు, 26న దుర్గామాతకు జంతుబలులను ఇచ్చి అందరూ వ్యవసాయ బావుల వద్దకు వన భోజనాలకు వెళ్తారని తెలిపారు.

లెదర్‌పార్కుకు మోక్షం కలిగేనా ?

- రెండు దశాబ్దాలు నిరుపయోగంగా ఉన్న భవనం
- అసెంబ్లీలో ప్రస్తావనతో మళ్లీ చిగురించిన ఆశలు



నిరుపయోగంగా ఉన్న లెదర్‌పార్కు భవనం



పని చేయని కుట్టుమిషన్లు

స్టేషన్‌ఘన్‌పూర్: దళితులకు జీవనోపాధి కోసం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతున్నామని పాలకులు చెపుతున్న మాటలు నీటిమీద రాతలుగా మారుతున్నాయి. ప్రభుత్వాలు మారినా, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు జరిగినా దశాబ్దాలుగా దళితులు జీవనోపాధి కోసం పడరాని పాట్లు పడుతూనే ఉన్నారు. దళితులపై పాలకుల నిర్లక్ష్యానికి మండలంలోని శివునిపల్లి శివారులో 20 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న లెదర్‌పార్కు భవనం నిదర్శనంగా నిలుస్తోంది. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లోని దళిత నిరుద్యోగ యువకులు, చర్మకారులకు శాశ్వతంగా జీవనోపాధి కల్పించే శివునిపల్లి శివారులో 2003లో టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి కడియం శ్రీహరి హయాంలో మినీ లెదర్‌పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. లెదర్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (లిడ్‌క్యాప్) ఆధ్వర్యంలో దాదాపు 25 ఎకరాల స్థలంలో పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముందుగా రూ.10 లక్షలతో లెదర్‌పార్కు భవనం నిర్మించారు. అనంతరం అందులో కుట్టు మిషన్లు, ఇతర యంత్రాలను ఏర్పాటు చేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు ఆ భవనం నిరుపయోగంగా ఉండగా ఇప్పుడు శిథిలావస్థకు చేరింది.

శిక్షణ ఇచ్చారు..ఉపాధి మరిచారు

2004లో సంబంధిత అధికారులు స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ తదితర మండలాల నుంచి చర్మవృత్తులపై కాస్త నైపుణ్యం ఉన్న 50 మంది నిరుద్యోగ దళితులను ఎంపిక చేసి వారికి చెన్నైలో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. లెదర్ బూట్లు, చెప్పులు, వేసుకునే కోట్లు, చేతి సంచులు, బెల్టులు, బ్యాగులు తదితర వస్తువుల తయారీలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ తీసుకున్న వారిని మాస్టర్ ట్రైనర్లుగా గుర్తించి ఘన్‌పూర్‌లో వివిధ మండలాలకు చెందిన విడతల వారీగా దాదాపు 500 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ ఇప్పించారు. దీంతో దళిత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశించారు. అయితే నాటి నుంచి నేటి వరకు పాలకులు లెదర్‌పార్కు ఊసే ఎత్తడం లేదు.

2 వేల మందికి ఉపాధి

లెదర్‌పార్కును ప్రారంభిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 2వేల మందికి జీవనోపాధి లభిస్తుంది. ఈ విషయమై దళిత సంఘాల నాయకులు, నిరుద్యోగులు పలుమార్లు సంబంధిత అధికారులు, పాలకులను కలిసి విన్నవించినా ఎలాంటి స్పందన లేదు. దాంతో దళితులు లెదర్‌పార్కుపై ఆశలు వదులుకున్నారు. ఇప్పటికే శిక్షణ పొందిన ట్రైనర్లు, దళిత నిరుద్యోగులు రోజువారి కూలీలుగా, ఆటోడ్రైవర్లుగా పనిచేస్తూ జీవనం గడుపుతున్నారు.

ఎక్స్‌పోర్ట్ కేంద్రంగా మారుతుంది

హైదరాబాద్ నుంచి వరంగల్ వరకు ఇండస్ట్రీయల్ కారిడార్ చేస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఐటీశాఖ మంత్రి కేటీఆర్ చేసిన హామీలు అమలుకు నోచుకోలేదు. ఇప్పటికే స్థలం కేటాయించి భవనం నిర్మాణమై ఉన్న ఘన్‌పూర్ లెదర్‌పార్కును వినియోగంలోకి తీసుకువస్తే రాష్ట్రస్థాయిలో ఎక్స్‌పోర్ట్ కేంద్రంగా అయ్యే అవకాశం ఉంది. తోళ్లతో తయారు చేసిన వస్తువులను ఇక్కడ నుంచి ఉమ్మడి జిల్లాకు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసుకోవచ్చు. తద్వారా రెండు వేలకు మందికి పైగా ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి.

బడ్జెట్‌లో ప్రస్తావించడంతో మళ్లీ ఆశలు

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మూడు నెలల క్రితం జరిగిన బడ్జెట్ సమావేశాల్లో పేద చర్మకారులకు జీవనోపాధి కల్పించే లెదర్‌పార్కుల అంశంపై రాష్ట్ర మంత్రి భట్టి విక్రమార్క ప్రస్తావించడం, అందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించడం నిరుద్యోగ దళితుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ఈ క్రమంలో లెదర్‌పార్కులను ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి భట్టి ప్రకటించడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ ఘన్‌పూర్ చర్మకారుల సంఘం ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి భట్టి విక్రమార్క తదితరుల ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం లెదర్‌పార్కు ఏర్పాటు చేసి పేద దళితులకు ఉపాధి కల్పించాలని పేద దళితులు కోరుతున్నారు. 20 ఏళ్ల క్రితం అప్పటి మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి హయాంలో లెదర్‌పార్కుకు శ్రీకారం చుట్టారని, ప్రస్తుతం అదే కడియం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నారని, ఈ విషయమై ప్రత్యేక చొరవతో కృషి చేసి లెదర్‌పార్కును ప్రారంభించి దళితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.

అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్, బీఆర్‌ఎస్

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్



జనగామ : ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు అవినీతికి కేరాఫ్‌గా మారాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ నేత, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఘన్‌పూర్‌లోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు అమలుకు సాధ్యం గాని హామీలు చేసి తెలంగాణ ప్రజలను దగా చేశారని, ఆరు నెలల్లోనే ప్రజల ముందు దోషిగా నిలబడ్డారన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ గత పదేళ్లు అవినీతిమయంగా నియంతపాలన సాగించిందన్నారు. దేశంలో గత పదేళ్ళలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, బీజేపీ పథకాలు ఇంటింటికీ చేరాయన్నారు. పట్టభద్రులు ఆలోచించి బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మురళీధర్‌గౌడ్, బొజ్జపల్లి సుభాష్, నలగం శ్రీనివాస్, హైందవిరెడ్డి, చిలుక విజయరావు, మండల పార్టీ అధ్యక్షుడు సట్ల వెంకటరమణ, నాయకులు యుగేందర్ రెడ్డి, అంజిరెడ్డి, వెంకటేశ్వర్లు, విష్ణు, శ్రీను, ప్రదీప్, కె.శరత్‌కుమార్, ప్రదీప్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘గుజ్జుల’ను గెలిపించండి

జనగామ: బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి గెలుపు కోరుతూ శుక్రవారం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేశ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలతో పాటు ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో జిల్లా డాక్టర్ సెల్ కన్వీనర్ పెద్ది శశిధర్ గుప్తా, కూకట్ల ఉప్పలయ్య, పానుగంటి శ్రీను, సాయి, నర్సింగ్ పాల్గొన్నారు.

చిల్పూరు: ఈనెల 27న నిర్వహించే పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని వంగాలపల్లిలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్, మాజీ సర్పంచ్ ఆరూరి ప్రణీతప్రదీప్, నాయకులు రమేష్, సదానందం, తిరుపతిరెడ్డి, రమేష్, రాహుల్, శ్రీనివాస్, భీమన్న, శ్రీనివాస్, రాజు, రజనీకర్ పాల్గొన్నారు.

బచ్చన్నపేట : గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి, నాయకులు బంగారు మహేష్, కూరెళ్ల వెంకట్‌రెడ్డి, పెండెం నాగేష్, పాల్గొన్నారు.

నర్మెట: బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ దళితమోర్చా మండల శాఖ అధ్యక్షుడు బుచ్చాల కొంరెల్లి కోరారు. మండలంలోని హన్మంతాపూర్‌లో శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు.

ఆర్థిక లావాదేవీలపై పెద్దమనుషుల ఒత్తిడి..

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

- కుటుంబ సభ్యులపై కులసంఘం సభ్యుల గొడవ
- పరిహారం చెల్లించకుంటే కులబహిష్కరణ చేస్తామని బెదిరింపులు
- పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు



పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు, కుటుంబ సభ్యులు

జనగామ: కుల పరపతి సంఘంలో గత కొంత కాలంగా నెలకొన్న ఆర్థిక లావాదేవీల విషయంలో తన భర్తపై ఒత్తిడి తీసుకు రావడంతో ఇటీవల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంటే.. కొంతమంది పెద్ద మనుషులు కనికరం లేకుండా తమపై అకారణంగా బదనాం మోపుతూ.. పరిహారం ఇవ్వకుంటే కుల బహిష్కరణ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని పట్టణంలోని చమన్ ఏరియా సంజయ్‌నగర్‌కు చెందిన బాధితురాలు ఉల్లెంగుల లలిత శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. భర్త ప్రభాకర్ ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుల పరపతి సంఘం అధ్యక్షుడిగా పని చేశాడు. ఆర్థిక లావాదేవీల విషయంలో సమస్య తలెత్తడంతో ప్రభాకర్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 19న ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 21న మూడో రోజు పలువురు కుల సభ్యులు మృతుడు ప్రభాకర్ ఇంటికి వచ్చారు. ఇదే సమయంలో మృతుడి కుటుంబం, కొంతమంది పెద్ద మనుషుల మధ్య గొడవ జరిగింది. పెద్ద మనుషుల కాళ్లు పట్టుకుని బతిమిలాడినా వినిపించుకోకుండా తనతో పాటు బంధువులను కింద పడేసి కొట్టినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ గొడవలో వారికి సంబంధించి 3 తులాల బంగారు గొలుసు కనిపించడం లేదని, నష్టపరిహారం ఇవ్వని పక్షంలో కుల బహిష్కరణ చేస్తామని బెదిరించారని పోలీస్ స్టేషన్‌లో తన గోడును వెల్లబోసుకున్నారు. తమ కుటుంబానికి రక్షణ కల్పించి, కుల బహిష్కరణపై విచారణ జరిపి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఐ రఘుపతిరెడ్డి మాట్లాడుతూ గొడవ, కుల బహిష్కరణకు సంబంధించి లలిత ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నట్లు చెప్పారు.

కదిలిన అధికార యంత్రాంగం

- భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

దేవరుప్పుల : మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారిలో యునైటెడ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎదుట నెల రోజుల కిందట లీకేజైన భగీరథ పైపులైన్ మరమ్మతులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. శుక్రవారం సాక్షిలో ‘భగీరథ పైపులైన్ మరమ్మతులో నిర్లక్ష్యం’ అనే శీర్షికన ప్రచురితం కాగా కథనానికి సదరు అధికారుల కదలిక మొదలైంది. నెల రోజుల నుంచి జీపీ, మిషన్ భగీరథ శాఖల మధ్య సమన్వయం కొరవడి మాదంటే ..మాపని కాదు..అనే రీతిలో సదరు అధికారులు వ్యవహరించడంతో బ్యాంకు ఎదుట వినియోగదారులకు అసౌకర్యంతో పాటు తాగునీరు కలుషితం అవుతుందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఎట్టకేలకు మిషన్‌భగీరథ యంత్రాంగం చేరుకొని స్థానిక సిబ్బంది సహకారంతో రహదారి రోడ్డును జేసీబీతో పగులగొట్టి గోతి తీయడంతో పైపులైన్ లీకేజీని గుర్తించి సత్వర మరమ్మతులకు శ్రీకారం చుట్టడం గమనార్హం.

సంక్షిప్త సమాచారం

ఇసుక రవాణాను అరికట్టాలి

దేవరుప్పుల : మండలేతర ప్రాంతాలకు ఇసుక రవాణా అనుమతులను సత్వరమే అరికట్టాలని కామారెడ్డిగూడెం యూత్ నాయకులు చింత నిఖిల్, ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక అవసరాలకు సవాలక్ష చిక్కులు కల్పిస్తున్న తరుణంలో వాగు నుంచి ఊర్లోకి కాకుండా ఇతర గ్రామాల కోసం కూపన్లు తీసుకొని ఇసుకను విచ్చలవిడిగా తరలిస్తున్నారని విమర్శించారు. పైభాగాన మండలాల్లో వర్షాభావ నీటిని దిగువ రాకుండా రిజర్వాయర్లు, కట్టుదిట్టమైన చెరువుల మరమ్మతులతో వాగులు పార్లే పరిస్థితులు లేవన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న కాస్తను తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటి భవిష్యత్‌లో రైతులకు వ్యవసాయసాగు భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

28న ఆలయంలో ప్రత్యేక సేవలు

చిల్పూరు : ఈనెల 28న శ్రీవారి శ్రవణానక్షత్రం పురస్కరించుకుని బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ప్రధాన అర్చకులు రవీందర్‌శర్మ, అర్చకులు రంగాచార్యులు, కృష్ణమాచార్యులతో కలిసి వివరాలను వెల్లడించారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పంచామృత వివిధ ఫలపుష్పాలతో అభిషేక సేవ, 7 నుంచి 9 వరకు చందనోత్సవం, అలంకార సేవ, 9 నుంచి 9.45 వరకు ఆరగింపు, నక్షత్రహారతి, ఉంటుందన్నారు. 10 నుంచి 10.45 వరకు అష్టదళ పాదపద్మారాదనసేవ, 11 నుంచి 12.30 వరకు శ్రీవారి కల్యాణం, 12.30 నుంచి 1.30 వరకు ఆరగింపు, అనంతరం భక్తులకు స్వామి వారి నిజదర్శనం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్, వీరన్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

రఘునాథపల్లి: మండలంలోని కోమల్లలో ఈ నెల 26 నుంచి 31 వరకు వేణుగోపాలస్వామి ఆలయంలో అధ్యయన, బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వంశ పారంపర్య ధర్మకర్త ఉత్తలూరు అనిల్‌బాబు శుక్రవారం తెలిపారు. ఈ నెల 26న అధ్యయనోత్సవం ఆరంభంతో అభిషేకం, తొళక్కం, 27న ప్రబంధ సేవాకాలం, పరమ పథోత్సవం, 28న సూత్తుందాది చాత్మర, అంకురార్పణం, 29న ధ్వజారోహణము, వైనతేయ ప్రతిష్ట, హోమం, బలిహరణ, ఎదుర్కోలు, 30న హోమం బలిహరణ, తిరుకల్యాణోత్సవం, గరుడ వాహనం, 31న మహా పూర్ణాహుతి, అవబృద స్నానం, శ్రీ పుష్పయాగం, ధ్వజావరోహణం, ఉత్సవ పరిసమాప్తితో ఉత్సవాలు ముగియనున్నట్లు పేర్కొన్నారు.

ఓటు గీత .. అధికార పార్టీకి వాతగా మిగలాలి



చిల్పూరు : మాట్లాడుతున్న రాజయ్య



జనగామ : మాట్లాడుతున్న ఆగన్న

చిల్పూరు : ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి వేసే ఓటు అధికార కాంగ్రెస్ పార్టీకి, బీజేపీకి వాతగా మిగిలిపోవాలని అందుకు ప్రతీ ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పిలుపునిచ్చారు. మండలంలోని మల్కాపూర్‌లో శుక్రవారం సాయంత్రం వెన్నం మాధవ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఓటర్ల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, రచ్చ రవీందర్, వేముల రవి, నారగోని రాజు, తదితరులు ఉన్నారు.

రాకేష్‌రెడ్డితోనే యువతకు న్యాయం

చిల్పూరు : బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపుతోనే యువతకు సరైన న్యాయం జరుగుతందని పార్టీ మండల నాయకుడు కేశిరెడ్డి రాకేష్‌రెడ్డి కోరారు.మాధవరెడ్డి, వంశీ, అలుగు అశోక్, వేముల రవి, గాలి ప్రవీణ్ పాల్గొన్నారు.

కొడకండ్ల : రాకేష్‌రెడ్డిని గెలిపించాలని మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు సతీష్ గౌడ్ కోరారు. శ్రీనివాస్, భానుచందర్, సోమయ్య, పాల్గొన్నారు.

నీతి, నిజాయతీ కలిగిన వ్యక్తిని గెలిపించండి

జనగామ: వరంగల్– ఖమ్మం– నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరుపున పోటీ చేస్తున్న నీతి, నిజాయితీ కలిగిన ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా పార్టీ అధ్యక్షుడు తోట ఆగన్న కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ప్రైవేట్ లెక్చరర్స్ యూనియన్ సభ్యుల సమావేశం లో పాల్గొని ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్ రెడ్డి, కౌన్సిలర్ వాంకుడోతు అనిత, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, నర్సిరెడ్డి, సుభాష్, శ్రీనివాస్, మల్లారెడ్డి, మీడియా ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు. పట్టణం 21వ వార్డులో కౌన్సిలర్ కర్రె శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఉల్లెంగుల సందీప్, తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట : రాకేష్‌రెడ్డి గెలుపు కోసం పాటు పడాలని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షులు గంగం సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నాయకులు బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకొని పకడ్బందీగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల రైతు బంధు సమితి మండల మాజీ కోఆర్డినేటర్ ఒజ్జుల అగ్గిరాములు, శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ బండారి శ్యాం, మాజీ ఎంపీపీ ఎర్రబెల్లి రమణారావు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య నియోజకవర్గ కోఆర్డినేటర్ చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. మండలంలోని ఉప్పుగల్లులో గ్రాడ్యుయేట్స్ ఓటర్లతో సమావేశాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు.

దేవరుప్పుల : బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పల్లసుందర్‌రామిరెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయాకర్, రవి, మాజీ ఎంపీపీ సోమన్న, హన్మంతు, పాల్గొన్నారు.

జనగామ రూరల్: విద్యావంతుడు బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చౌడారం మాజీ ఎంపీటీసీ కొమురయ్య అన్నారు. రాజయ్య, ప్రవీన్, రాజు, కర్నాకర్ పాల్గొన్నారు.

కేసీఆర్ విగ్రహాన్ని సందర్శించిన రాజయ్య



కేసీఆర్ విగ్రహం వద్ద కార్యకర్తలతో రాజయ్య

చిల్పూరు: మండల కేంద్రంలోని బ్రరెంకల చెరువు కట్టపై మాజీ సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ సొంతఖర్చులతో నిర్మించిన బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ విగ్రహాన్ని స్టేషన్‌ఘన్‌పూర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యేలు రాజయ్య, రవిశంకర్ శుక్రవారం సందర్శించారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నందున తిరిగి ప్రజలు బీఆర్‌ఎస్‌ను కోరుకుంటున్నారని అన్నారు. వారి వెంట రాజ్‌కుమార్, నారగోని రాజు, మాచర్ల ప్రవీణ్, రజనీకుమార్, మహేందర్, రమేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీగా ఆదరించాలి



బచ్చన్నపేట: ఓట్లు అభ్యర్థిస్తున్న శ్రీధర్‌రెడ్డి



రఘునాథపల్లి : మాట్లాడుతున్న జగదీష్‌చందర్‌రెడ్డి

బచ్చన్నపేట : ఖమ్మం–నల్లగొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను ఆదరించాలని మండలంలోని బండనాగారం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో పట్టభద్రుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని కలిసి ఓట్లను అభ్యర్థించారు. పర్శరాములు, కనుకయ్య, అయిలయ్య, మహేందర్, మల్లయ్య, లక్ష్మారెడ్డి, కనుకయ్య, రాజు, బలరాం, బాపు, తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కుర్చపల్లిలో గ్రాడ్యుయేట్స్‌తో సమావేశమై వారికి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు మేకల నరేందర్, గాదె రమేష్, దేవేందర్‌రెడ్డి, తోటకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలో పడమర కొండపై వెలసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో కొండ దిగువన ఉన్న ఆలయంలో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రతిఏటా మూడు రోజుల పాటు జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. చివరి రోజున నిర్వహించిన లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చరణల మధ్య స్వామివారి ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేశారు. సుమారు మూడు గంటల పాటు సాగిన స్వామి వారి కల్యాణమహోత్సవాన్ని భక్తులు కనులాలా తిలకించి భక్తిపారవశ్యంతో మునిగిపోయారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు భక్తులు, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పాలకుర్తి : ప్రజలకు వస్తున్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం సత్వరమే చర్యలు తీసుకుంటున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ సాధరలాల్ అన్నారు. మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. గత రెండు రోజులుగా వచ్చిన ఈదురుగాలుల వల్ల విద్యుత్ స్తంభాలు ఒరిగి ఏర్పడ్డ అంతరాయాలు, 33 కేవీ లైన్ మెయింటెనెన్స్, తొర్రూరు విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం స్తంభాలు, స్థలసేకరణ, వ్యవసాయ బోరు బావులు సరఫరాలో వచ్చిన సమస్యల గురించి సమావేశంలో చర్చించారు. సమావేశంలో ఎస్‌ఈ వేణుమాధవ్, ఏడీఇ తిలక్, సత్యనారాయణ, ఏఈ రణధీర్, సబ్ ఇంజనీర్ రామకృష్ణ, పాల్గొన్నారు.

కాపర్ వైరు చోరీ



దేవరుప్పుల : ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని కాపర్ వైరు దొంగిలించగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్. చెన్నకేశవులు తెలిపారు. మండలంలోని రామచంద్రాపురంలో పేర్వారి వీరాస్వామి వ్యవసాయ భూమి వద్ద దిమ్మపై ఉన్న ఎస్ఎస్–09–25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాత్రి పగులగొట్టి కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. సదరు రైతు శుక్రవారం వ్యవసాయ సాగు పనులకు వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి ఉండడంతో విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎన్పీడీసీఎల్ సింగరాజుపల్లి ఏఈ ఎం రాజవర్దన్‌రెడ్డి పరిశీలించి చట్టపరమైన చర్యల కోసం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వివరించారు.